క్లుప్తంగా

గణపతికి సహస్ర రుద్రాభిషేకం



రుద్రాక్షల అలంకరణలో సంపత్ విజయ గణపతి స్వామి

బోట్‌క్లబ్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయ శాఖ డీసీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్ విజయ గణపతి స్వామి వారికి శుక్రవారం సహస్ర రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక పంచామృతాభిషేకాన్ని, అనంతరం ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. దేవదాయ శాఖ డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గణేశ సాహిత్య కార్యక్రమం

బోట్‌క్లబ్: తెలుగు భాషలో ప్రచురితమైన యోగానుభూతి కవిత్వ విశ్లేషణ బ్రహ్మాండమైన బ్రహ్మానందం పొందడం కోసమేనని పద్య కవి కొరుప్రోలు గౌరినాయుడు అన్నారు. స్థానిక రామారావుపేటలోని శ్రీవేణుగోపాల సంస్కృత ప్రచార సభలో శుక్రవారం ఏర్పాటు చేసిన గణేశ సాహిత్య కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. సభాధ్యక్షుడు నిట్టల వెంకట సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, గురు కటాక్షం ఉంటే ఏ సమస్య అయినా త్రుటిలో పరిష్కారమవుతుందన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు కాశీబొట్ల సత్యనారాయణ, కాకరపర్తి దుర్గాప్రసాద్, ప్రచార సభ ఉపాధ్యక్షుడు సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు



మొక్కలు నాటే కార్యక్రమంలో పెద్దలు, విద్యార్థులు

కాకినాడ రూరల్: వీఎస్ఎల్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కాకినాడ ఒకటో డివిజన్‌లోని రమణయ్యపేట బోట్‌క్లబ్ ఉద్యానవనంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రాఘవరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచాలన్నారు. తమ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కె.సుకన్యప్రసాద్ నాయుడు, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

బోట్‌క్లబ్: బాలగణేశ యూత్ ఆధ్వర్యంలో స్థానిక పేర్రాజుపేట కరసూదివారి వీధిలో శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు పూజా సామగ్రి అందించారు. సుమారు 200 మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత నిమజ్జనానికి అనుమతి

కాకినాడ సిటీ: ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత సిటీ వినాయక సాగర్‌లో మూడు అడుగుల గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం అనుమతి ఇచ్చిందని నగర గణేశ్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు శుక్రవారం స్థానిక జగన్నాథపురంలో విలేకర్లకు తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాలతో ఆర్డీఓ ఇట్ల కిశోర్ నిమజ్జన ఏర్పాట్లను పూర్తి చేశారన్నారు. ఈ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు ప్రత్యేక పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నిర్వహణను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. 35 ఏళ్ల వినాయక సాగర్‌లో అనుమతి లేని పార్కు నిర్మాణం, కరోనా విపత్తు వలన ఐదేళ్ల కాలం వృథా అయ్యిందన్నారు. వాహనాల ప్రవేశం లేకుండా విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం అనుమతించడం వల్ల, వంతెనపై నుంచి ప్రతిమలు, పూజా పత్రి విసరకుండా, వినాయక సాగర్‌లో నేరుగా కలిపే అవకాశం లభించిందన్నారు. శుక్రవారం సాయంత్రం నిమజ్జన ప్రాంతాన్ని గణేశ్ ఉత్సవ కమిటీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, తదితరులు పరిశీలించారు.

కందిపప్పుకి ఎసరు..!



- అంగన్‌వాడీల్లో కానరాని పౌష్టికాహారం
- రెండు నెలలుగా కందిపప్పు ఎగవేత
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందని పోషకాహారం

కాకినాడ సిటీ: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు పేర్లు మార్చడంలో కూటమి ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధ.. పథకాలను అమలు చేయడంలో చూపించడం లేదు. ప్రతి పథకాన్ని గొప్పగా అమలు చేస్తామని సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో గ్రామగ్రామాన కూటమి నేతలు ఊదరగొట్టారు. తీరా గద్దె నెక్కాక హామీలను విస్మరించడంతో, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనం సక్రమంగా చేరడం లేదు. తాజాగా గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన కందిపప్పు ఇంత వరకూ వారికి అందలేదు. కందిపప్పు లేకుండానే మిగతా సరకులు అంగన్‌వాడీల్లో లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు.

పథకానికి పేరు మార్పు!

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందించిన పౌష్టికాహార పంపిణీకి వైఎస్సార్ సంపూర్ణ పోషణ అని పేరు పెట్టింది. ఈ పథకం



అంగన్‌వాడీ కేంద్రం

కింద గర్భిణులు, బాలింతలకు కిట్లు అందేవి. ఈ పథకం కింద బియ్యం మూడు కిలోలు, కందిపప్పు కిలో, ఆయిల్ అర కిలో, రాగిపిండి రెండు కిలోలు, అటుకులు కిలో, ఖర్జూరం పావు కిలో, చెక్కీలు పావు కిలో, బెల్లం పావు కిలో, పాలు 5 లీటర్లు, 25 కోడిగుడ్లు చొప్పున అందించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి బాల సంజీవని అని పేరు మార్చింది.

కందిపప్పు లేకుండానే..

గర్భిణులు, బాలింతలకు ప్రస్తుతం గత రెండు నెలలుగా కందిపప్పు లేకుండానే అంగన్‌వాడీలు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో నాలుగు మండలాల్లో 334 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6,845 మంది గర్భిణులు, బాలింతలున్నారు. వారిలో గర్భిణులు 3,897 మంది, బాలింతలు 2,948 మంది ఉన్నారు. వారికి 6,845 కిలోల కందిపప్పు అవసరం. గత రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వలేదు. గర్భిణులు, బాలింతలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు 27,385 మంది ఉన్నారు. వీరికి రోజు ప్రభుత్వ మెనూ ప్రకారం కందిపప్పు, ఆకుకూర, కాయగూరలతో వంట చేసి పెట్టాల్సి ఉంది. కందిపప్పు లేకపోవడంతో మెనూ అమలు సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లల సంఖ్య రానురాను తగ్గిపోతోందని అంటున్నారు.

పాత పద్ధతిలోనే బోధన

కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కరప, కాకినాడ రూరల్ మండలాలు, కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కాకినాడ అర్బన్, పెదపూడి మండలాలున్నాయి. రెండు ప్రాజెక్టుల పరిధిలో 334 కేంద్రాలున్నాయి. ఇందులో మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 9,714 మంది, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 17,671 మంది ఉన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు నేటి వరకు అందలేదు. దీంతో పాత పద్ధతిలోనే బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు దాటుతున్నా, ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించ లేదు. ఈ పుస్తకాల్లో చిన్నారులకు ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండటంతో, తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేవారు. ఈ ఏడాది నేటి వరకూ పుస్తకాలు రాకపోవడంతో ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు తమ చిన్నారులకు కాన్వెంట్లలో చేర్పించారు. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా వారికి అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.



ప్రభుత్వం సరఫరా చేసే కందిపప్పు ప్యాకెట్



కందిపప్పు లేకుండా గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న కిట్లు

టెండర్ పిలిచాం



గర్భిణులు, బాలింతలకు సంబంధించి కందిపప్పు జిల్లా పౌర సరఫరాల సంస్థ ద్వారా సరఫరా అయ్యేది. ఇప్పుడు వారి వద్ద కందిపప్పు లేదు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారానే టెండర్ పిలిచాం. అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు అందించేందుకు కొంత సమయం పడుతుంది. అందుకే అందించలేకపోయాం. వచ్చిన వెంటనే అందిస్తాం.

– ప్రవీణ, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి, కాకినాడ

ధాన్యం గణపతికి ప్రత్యేక పూజలు

పది అడుగుల అగర్‌బత్తీ వెలిగించిన ద్వారంపూడి



పది అడుగుల అగర్‌బత్తీని వెలిగిస్తున్న ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక దిగుమర్తివారివీధిలో 18 అడుగుల ధాన్యంతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని సిటీ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సైకిల్ బ్రాండ్ అగర్‌బత్తీ వారి సహకారంతో ఏర్పాటు చేసిన పది అడుగుల భారీ అగర్‌బత్తీని ద్వారంపూడి వెలిగించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ధాన్యంతో చేసిన విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని కమిటీ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, పార్టీ నాయకురాలు మాకినీడి శేషు కుమారి, మాజీ కార్పొరేటర్లు రాగిరెడ్డి బన్నీ, నల్లబిల్లి సుజాత, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ రాజనాల కన్నా తదితరులు పాల్గొన్నారు. స్థానిక 50 బిల్డింగ్ సెంటర్‌లో వినాయకుడి విగ్రహాన్ని ద్వారంపూడి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జేసీ



సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట బీచ్‌లో ఈ నెల 16న జరగనున్న వినాయక విగ్రహాల నిమజ్జనాల ఏర్పాట్లను జేసీ రాహుల్ మీనా శుక్రవారం పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా నిమజ్జనాలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు, జేసీ వెంట తహసీల్దార్ సత్యనారాయణ ఉన్నారు.

కాకినాడ సిటీ: ఇలాఉండగా స్థానిక జగన్నాథపురం నేతాజీ పార్కు వద్ద విశాఖ ఫ్రెండ్స్ సర్కిల్ వారు ఏర్పాటు చేసిన 15 అడుగుల పంచదార వినాయకుని మండపంలో శుక్రవారం పెద్దఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. చైత్ర శాలిని డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది మహిళలు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన రైల్వే పోలీసులు

సామర్లకోట: బలవన్మరణానికి యత్నించిన మహిళను శుక్రవారం సాయంత్రం సామర్లకోట రైల్వే పోలీసులు కాపాడిన సంఘటన ఇది. రైల్వే స్టేషన్ ఆవరణలో సీసీ కెమెరాలు లేకపోవడంతో, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు తన సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒకటో నంబరు ప్లాట్‌ఫారం లోని ఫ్లై ఓవర్ వంతెన వద్ద ఓ వివాహిత ఏడుస్తూ గస్తీ పోలీసులకు కంటపడింది. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వందేభారత్ రైలు రావడం, ఆ రైలు కింద దూకేందుకు మహిళ పరుగెత్తుకుంటూ వెళ్లడాన్ని పోలీసులు గమనించారు. అప్రమత్తమైన రైల్వే కానిస్టేబుల్ వైవీఎస్ నారాయణ ఆమెను అడ్డుకుని, జీఆర్పీ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సై లోవరాజు శుక్రవారం సాయంత్రం



మహిళను బంధువులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

ఆమె బంధువులకు సమాచారం అందించారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి, బంధువులకు అప్పగించారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆమె ఈ ఘటనకు పాల్పడినట్టు తెలిసింది. ఆమె బంధువులు రైల్వే పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అత్యాధునిక ఫీచర్స్‌తో బోల్డ్ న్యూ హుందాయ్



హ్యుందాయ్ బోల్డ్ న్యూ కారును ఆవిష్కరిస్తున్న అతిథులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలోని సాయి స్వర్ణ హ్యుందాయ్ షోరూమ్‌లో శుక్రవారం బోల్డ్ న్యూ హ్యుందాయ్ అల్కాజర్ ఎస్‌యూవీ కారు ఆవిష్కరణ జరిగింది. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ శ్రీధర్‌బాబు, రీజనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ సాయి సర్వోత్తమ్ ఈ కారును ఆవిష్కరించారు. షోరూం జీఎం పవన్‌కుమార్ మాట్లాడుతూ, ఈ కారులో ఎన్నో ఆత్యాధునిక ఫీచర్స్ ఉన్నాయన్నారు. అనేక సేఫ్టీ ఫీచర్స్‌తో పాటు, 70కి పైగా అత్యాధునిక ఫీచర్స్ ఈ కారులో ఉన్నాయన్నారు. ఈ కార్ పెట్రోల్, డీజిల్ మోడల్స్‌లో ఉన్నాయన్నారు. కార్ టెస్ట్ డ్రైవ్‌కు అందుబాటులో ఉంచామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా, ఇద్దరికి రెండు రోజులు, ఒకరికి నాలుగు రోజుల జైలు, ఐదుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి

బాలాజీచెరువు: విద్యార్థులంతా హిందీ భాషపై పట్టు సాధించాలని పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తిరుపాణ్యం మాట్లాడుతూ, దేశంలోని అన్ని ప్రాంతాల్లో హిందీ భాష వాడుకలో ఉందన్నారు. అధ్యాపకులు హిందీ సెమినార్లలో పాల్గొని, విద్యార్థులను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్ మాట్లాడుతూ, జాతీయ ఉద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష దోహదపడిందన్నారు. అందుకు గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగంలో 351వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయ భాషగా పొందుపరిచారన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేవీ సత్యనారాయణ, వేదుల శిరీష, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఉష, బేగం పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

ఐఐఎఫ్‌టీ విద్యార్థుల ఓరియంటేషన్ ముగింపు



ఓరియంటేషన్ ముగింపులో విద్యార్థులతో అతిథులు

బాలాజీచెరువు: వారం రోజుల పాటు జేఎన్‌టీయూకే సెనేట్ హాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫారిన్ ట్రేడ్ కోర్సుకు సంబంధించి అడ్మిషన్ పొందిన 2024–29 బ్యాచ్ విద్యార్థులకు జరిగిన ఓరియంటేషన్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఐఐఎఫ్‌టీ హెడ్ వడ్లమూడి రవీంద్ర సారథి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, ఐఐఎఫ్‌టీ వీసీ రాకేష్ మోహన్‌జోషి, ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్, ఆరోరా లైఫ్ సైన్సెస్ సీఈఓ రాజేంద్రరావు హాజరయ్యారు. ఫస్టియర్ విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ప్రాధాన్యాన్ని వివరించారు. ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ భాష అభ్యాసనం ప్రాముఖ్యాన్ని వివరించి, విద్యార్థులు ధైర్యంగా ప్రతి సవాళ్లను ఏదుర్కోవాలన్నారు. ఈడీ రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ ఐఐఎఫ్‌టీ అనేది ఆధునిక గురుకులం లాంటిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్‌టీ ఓఎస్‌డీ బాబురావు నాయుడు పాల్గొన్నారు.

ఉప్పొంగిన యువ కెరటం

- జిల్లా స్థాయి యువజనోత్సవాల సందడి
- సెట్రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుక
- ప్రారంభించిన జేసీ రాహుల్ మీనా

కాకినాడ రూరల్: సాగర తీర నగరం కాకినాడలో యువత కేరింతలు కొట్టింది. తమలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వేదికపై ప్రదర్శించి సత్తా చాటారు. ఉప్పొంగిన కెరటంలా యువతీ, యువకులు డ్యాన్సులతో ఉర్రూతలూగించారు. పాటలతో మైమరిపించారు. తమలోని చిత్ర కళా చాతుర్యంతో ఆకట్టుకున్నారు. ఇలా ఎన్నో అంశాల్లో ప్రతిభను చూపించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ(సెట్రాజ్) ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా స్థాయి యువజనోత్సవాలు – 2024ను శుక్రవారం ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళా వాహిని కళా మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, వేడుకలను జేసీ రాహుల్ మీనా లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకలను వీక్షించి.. తన బాల్యం గుర్తుకొస్తుందన్నారు. స్వామి వివేకానందను యువతీయువకులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇలాంటి వేడుకల్లో పాల్గొంటే, మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయన్నారు. సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ యువజనోత్సవాలకు మొత్తం 641 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా నమోదై, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇన్నోవేషన్స్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ థీమ్‌గా సాగిన ఈ పోటీల్లో 15 నుంచి 29 ఏళ్ల యువతీయువకులు పాలుపంచుకున్నారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యం(బృందం), సోలో, జానపద గేయ బృందం, సోలో, కథ రాయడం, కవిత్వం, పెయింటింగ్, ఉపన్యాసం, హస్తకళల పోటీలు నిర్వహించారు. సెట్రాజ్ సిబ్బంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించగా, సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వేశ్వరరావు, సత్కళా వాహిని వ్యవస్థాపకుడు కృష్ణామాచార్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

సైన్స్ అండ్ టెక్నాలజీ ఆవిష్కరణలో నందిని అండ్ టీమ్ ప్రథమ, బి.సత్యఅభినయ టీమ్ ద్వితీయ, సీహెచ్ రమ్య గీతిక టీమ్ తృతీయ స్థానాలు సాధించారు. జానపద నృత్యం గ్రూపులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో దిలీప్ గ్రూప్, దింశా గ్రూప్, ఆదిత్య డ్యాన్స్ గ్రూప్ నిలిచాయి. జానపదం సోలోలో తొలి మూడు స్థానాల్లో ఓ.రమ్యశ్రీ, టి.తేజశ్విని, టి.చరణ్ జ్యోతి సరస్వతి నిలిచారు. జానపద గేయం గ్రూపులో ఆర్ స్టార్ ఉదయ్ టీమ్, సాయిశ్రీ టీమ్, స్వాతి అండ్ టీమ్ విజేతలుగా నిలిచాయి. జానపద గేయం సోలో విభాగంలో సాయిశ్రీ,. సాయి ప్రశీద, వి.అమృత విజేతలుగా నిలిచారు. కథ రచనలో నాగ వీరవెంకటలక్ష్మి, త్రివేణి, చాందిని, పెయింటింగ్‌లో చంద్రలేఖ, సమీర్, ఆనందకుమారి, కవిత్వంలో వట్టికూటి శ్రీరామ్, బట్టా సాయి, దేవీప్రియా విజేతలుగా నిలిచారు. ఉపన్యాసంలో ధృవీత్, హర్షియ, యువసాయి, యువకృతి విభాగంలో అపర్ణ, భావన, శృతి గెలుపొందారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.



యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న జేసీ రాహుల్ మీనా

పీఆర్ విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు: యువజనోత్సవాల్లో పీఆర్ డిగ్రీ విద్యార్థులు ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఫోక్ డాన్స్‌లో, ఫోక్ సాంగ్‌లో ప్రథమ స్థానాలు సాధించారు. అలాగే పెయింటింగ్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అభినందించారు.



సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు



ఆకట్టుకున్న జానపద నృత్య ప్రదర్శన